నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 21 జూన్ 2024 | MEDAK

లో వోల్టేజీతో ఇబ్బందిపడుతున్న రైతులు

మిరుదొడ్డి, జూన్ 20: లోవోల్టేజీతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో వచ్చే టూఫేజ్ (డిమ్మ్) కరెంట్‌తో మోటర్లు కాలిపోయి పంటలు పండక రైతులు శాన బాధలు పడుతున్నారు. కాలిపోయిన మోటర్లు రిపేరు చేస్తే మాకు కొన్ని డబ్బులు అచ్చినాయి. కానీ రైతులు మాత్రం ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. కేసీఆర్ సార్ ప్రభుత్వం ఉండగా రైతులకు కరెంట్ కష్టాలు అస్సలు లేవు. 24 గంటలు కరెంట్ అట్టింది. మాకు మోటర్ల పని లేనేలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులకు కరెంట్ కష్టాలు మల్లా మొదలైనయి. కరెంటు గిట్లా ఉంటే ప్రజలందరికీ కష్టాలే.

- మద్దెల యాదగిరి, మోటర్ మెకానిక్, మిరుదొడ్డి

తెలంగాణ రాకముందు అధ్వాన్నం

హుస్నాబాద్ టౌన్, జూన్ 20: తెలంగాణ రాకముందు కరెంట్ అధ్వాన్నంగా ఉండే. కరెంట్ ఎప్పుడు అత్తదో...ఎప్పుడు పోతదో తెల్వదు. ఒకవేళ అచ్చినా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవవుడు, సక్కగ రాకపోవవుడు ఉండే. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే ట్రాక్టర్లలో తీసుకపోవుడు... రోజుల తరబడి సూసుకుంట అక్కడే ఉండేది. తెలంగాణ అచ్చినంక కేసీఆర్ సీఎం అయినంక అన్ని కరెంట్ ఇబ్బందులు పోయినయి.. కేసీఆర్ గెలిచినప్పటి నుంచి రైతులకు ఏ లోటులేకుండా అయింది. ఆయన అచ్చినంకనే రైతులకు న్యాయం జరిగింది. నిజంగా చెప్పాలంటే రైతులకు ఏ రందీ లేకుండా ఎవుసం జరకిగింది. మళ్లీ కాంగ్రెస్ అచ్చినంక మళ్లీ మొదటికొచ్చింది.

- మర్యాల రాంరెడ్డి, రైతు, హుస్నాబాద్ టౌన్

కేసీఆర్ ప్రభుత్వంలో నిరంతర కరెంట్

తొగుట జూన్ జూన్ 20: కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు రైతులకు 24 గంటల కరెంటు అచ్చేది. అప్పుడు బాయిల కాడ బోరుమోటర్లు అస్సలు కాలిపోయేవి కాదు. కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చినంక కరెంటు ఎప్పుడు వస్తదో.. ఎప్పుడు పోతదో తెలియడం లేదు. చిన్నపాటి వర్షం ఈదురుగాలులకు కరెంటు తీస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రెప్పపాటు కూడా కరెంట్ పోలేదు. ఇప్పుడు లోవోల్టేజీతో మోటర్లు కాలిపోయి రైతులు అటు ఆర్థికంగా, ఇటు పంటలు సరిగా పండక సస్టపోతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వమే బాగుండే. కేసీఆర్ మళ్లీ రాకపాయే...

- పొత్కుల బాలయ్య, రైతు, వెంకట్రావుపేట గ్రామం

24 గంటల కరెంట్‌తో మంచిగా బతికినం

నిజాంపేట, జూన్ 20: కేసీఆర్ అందించిన 24 గంటల కరెంట్‌తో రైతులు వ్యవసాయం చేసుకుంటూ మంచిగా బతికిండ్రు. టైంకు రైతుబంధు పైసలు వస్తుండే వాటితో ఎరువులు, విత్తనాలు కొని ఎవుసం పనులు మొదలుపెట్టిటోళ్లం. పుష్కలంగా కరెంట్, నీళ్లు ఉండడంతో ఏ రందీ లేకుండా ఆనందంగా పంటలు పండించుకొని మంచిగా ఉండేవాళ్లం. ఎవుసం అంటే ఎంటో తెలియని పాలకుల చేతికి తెలంగాణ రాష్ట్రం చిక్కింది. కరెంట్ ఎప్పుడోస్తుందో ఎప్పుడు పోతుందో తెలియక రైతులు పొలాల కాడ కరెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. ఆ వచ్చే కరెంట్ కూడా సక్కగా రాక పొలాల కాడ మోటర్లు కాలిపోతున్నాయి. లోవోల్టేజీతో ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయి. తెలంగాణ రాకముందు ఎట్లుండెనో...గిప్పుడు మల్లా గట్ల తయారైంది.

- వెంకట్‌స్వామి గౌడ్ రైతు, నస్కల్, నిజాంపేట మండలం

ఒకటే మోటరు నడుస్తుంది..

కోహీర్, జూన్ 20: నేను ఎనిమిది ఎకరాల్లో చెరుకు, అల్లం పంట పండిస్తున్నా. పంటలకు నీరు అందించేందుకు మూడు బోరు మోటర్లు ఉన్నాయి. లోవోల్టేజీ ఉండడంతో ఒకటే మోటరును నడిపిస్తున్నా. మూడు మోటర్లు ఒకేసారి నడిపిస్తే రెండు మోటర్లు కాలిపోతున్నాయి. అందుకే ఒక్క మోటరునే నడిపిస్తున్నా. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. మళ్లీ కాంగ్రెస్ వచ్చినంక ఇబ్బందులు తప్పడం లేదు. కరెంట్ సక్కగా రాక బయిలకాడ మోటర్లు చూసుకోవడమే సరిపోతుంది.

- ప్రసాద్, రైతు, మనియార్‌పల్లి, కోహీర్ మండలం

కరెంటు సక్కగ అస్త లేదు..

కోహీర్, జూన్ 20: కరెంటు ఎప్పుడు వస్తుందో...ఎప్పుడు పోతుందో ఎవరికీ తెలియదు. నా చేను కాడ అల్లం పంట వేశా. పంటకు నీళ్లు పెడదామంటే మోటరు ట్రిప్ అవుతుంది. అసలు ఏమి జరుగుతున్నదో తెలియడం లేదు. అధికారులు ఎవరూ స్పందించరు. వారం రోజుల నుంచి వర్షం పడటం లేదు. పంటకు నీళ్లు పెడదామంటే కరెంటు సరిగా ఉండదు. కేసీఆర్ ఉన్నప్పుడు ఏ రంది లేకుండే. కాంగ్రెస్ వచ్చినంక మార్పు అంటే ఇదేనేమో....ఆ పాలకులకే తెలియాలి. రైతులను పట్టించుకోకుంటే మాత్రం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవు.

- నర్సింహారెడ్డి, రైతు. గురుజువాడ, కోహీర్ మండలం

చినుకు పడినా.. కొమ్మ ఊగినా కరెంట్ బంద్

కొమురవెల్లి, జూన్ 20 : తెలంగాణ రాక ముందు కరెంట్ ఎట్లా ఉండేదో.. గిప్పుడు గట్లనే ఉంది. కేసీఆర్ సార్ ముఖ్యమంత్రి అయినంకా ఏం కష్ట పడ్డడో ఏమోగానీ రైతులకు ఇబ్బందులు లేకుండా కరెంట్ ఇచ్చిండు. గిప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ లెక్క ఎందుకు కరెంట్ ఇవ్వలేకపోతుందో సమాధానం చెప్పాలి. ఇంకా వానలు మొదలు కానేలేదు. ఎప్పుడైన చినుకు పడినా, కొమ్మ ఊగినా కరెంట్ పోతున్నది. ఎప్పుడు వస్తదో తెల్వదు...కేసీఆర్ సార్‌ను తిడుతున్న కాంగ్రెసోళ్లు ఆయన ఇచ్చినట్లు కరెంటు ఎందుకు ఇస్తాలేరు. కాంగ్రెస్ పాలనలో మాత్రం రైతులకు కరెంట్ కష్టాలు తప్పవు. మళ్లీ పాతరోజులే...బయిల కాడ ఉండక తప్పదు.

-మల్లం నర్సింహులు, రైతు, ఐనాపూర్, కొమురవెల్లి

కేసీఆర్ ప్రభుత్వ కృషి ఫలితమే 24 గంటల కరెంట్

ములుగు, జూన్ 20: బీఆర్ఎస్ ప్రభుత్వ కృషితోనే 24 గంటల కరెంట్ తెలంగాణ రాష్ట్రంలో సాధ్యమైంది. ఆ కృషి వెనుక అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదల ఎంతో ఉంది. తెలంగాణ రాకముందు కరెంట్ ఎప్పుడు వస్తదో, ఎప్పుడు పోతదో తెలిసేది కాదు. అలాంటి పరిస్థితుల నుంచి 24 గంటలు కరెంటును చూసుడు కేసీఆర్‌తోనే సాధ్యమైంది. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు కరెంటు లేక, పంటలు పండక ఎంతో మంది రైతులు అప్పుల బాధలతో ఆత్మహత్యలు చేసుకుండు. కానీ కేసీఆర్ ప్రత్యేక చొరవ చూపి తెలంగాణలో రైతుల తలరాతలను మార్చిండు. మళ్లీ కాంగ్రెస్ వచ్చుడుతో అప్పటి పరిస్థితులు దాపురించినయ్.

- చింతకింది కిష్టయ్య, ములుగు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

ప్రజలను వంచించిన కాంగ్రెస్

- అమలుకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి..
- అటకెక్కిన రూ.2లక్షల రుణమాఫీ
- పింఛన్లు డబుల్ చేస్తామని మొండిచేయి..
- కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు నిల్..
- రూ.15 వేల రైతు భరోసా ఏదీ..
- ప్రభుత్వంపై ధ్వజమెత్తిన సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, జూన్ 20: ఎన్నికల ముందు అమలుకు సాధ్యంకాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా ప్రజలను మోసం చేస్తున్నదని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాం పు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ అమలుకు సాధ్యంకాని హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా రైతాంగానికి రూ.2లక్షలు రుణమాఫీ చేయాలన్నారు. వృద్ధు లు, వితంతువులతోపాటు అన్ని రకాల పింఛన్లు డబుల్ చేసి పంపిణీ చేస్తామన్న హామీపై ప్రభుత్వానికి చలనం లేదని దుయ్యబట్టారు. పేదింటి ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ కింద రూ.లక్ష నూట పదహారుతోపాటు తులం బంగారం ఇస్తామని మొండిచేయి చూపడంతో ప్రభుత్వంపై మహిళలు అగ్రహంతో ఊగిపోతున్నారని స్పష్టం చేశారు. సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ప్రజలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కడం అలవాటేనన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు కింద ఎకరానికి రూ.10వేలు పెట్టుబడి సాయాన్ని అందిస్తే, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎకరాకు రూ.15వేలకు పెంచి ఖాతాల్లో జమ చేస్తామన్నా మాటలు నీటి మూటలుగానే ఉన్నాయన్నారు. కేసీఆర్ హయాంలో సాగు, తాగు నీటికి ఢోకాలేకుండా నిరంతరం కరెంట్ సరఫరా జరిగిందని, కరెంటు కోతలు లేకుండా 24గంటలూ సేద్యానికి అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న పథకాల కన్నా అధికంగా కాంగ్రెస్ ఇస్తదని ఆశతో ప్రజలు ఎన్నికల్లో పట్టం కడితే మోసం చేసి సొమ్మ చేసుకుంటున్నారని తీవ్రంగా మండిపడ్డారు. అభివృద్ధి, సంక్షేమంపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. అధికారంలోకి వచ్చాం అందినకాడికి దోచుకొని దాచుకోవడమే లక్ష్యమన్నట్లుగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే అగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు గోవర్ధన్‌నాయక్, నాయకులు కాసాల బుచ్చిరెడ్డి, కల్వకుంట్ల నర్సింగ్‌రావు, జీవి శ్రీనివాస్, జలేందర్, సంతోశ్‌రెడ్డి, ముజీబ్, కసిని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పూలే స్ఫూర్తిని కొనసాగించాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క

కమలాయపల్లిలో జ్యోతిరావు పూలె, సావిత్రిబాయి పూలె విగ్రహాలను ఆవిష్కరిస్తున్న సీతక్క

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 20: మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేల స్ఫూర్తిని కొనసాగించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క అన్నారు. గురువారం మద్దూరు మండలంలోని కమలాయపల్లిలో ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ బయోడీజిల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాజీఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 200 ఏండ్ల క్రితం గ్రామాల్లో ఉన్న అంటరానితనం, అస్పృశ్యతలపై జ్యోతిరావు, సావిత్రిబాయి పూలేల పోరాటాల ఫలితంగానే ఈరోజు మనం స్వేచ్ఛగా బతుకుతున్నామన్నారు. స్త్రీలకు విద్య ఎంతో అవసరమని గ్రహించి మహిళల కోసం పాఠశాలలను ఏర్పాటు చేసిన ఘనత సావిత్రిబాయిపూలేకు దక్కుతుందన్నారు. చేర్యాల ప్రాంతం ఉద్యమాల గడ్డ అని, చేర్యాల ప్రజల రక్తంలోనే తిరుగుబాటు ఉన్నదన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, విప్లవోద్యమాల నుంచి మలిదశ తెలంగాణ పోరాటం వరకు చేర్యాల ముందు వరసలో నిలిచిందన్నారు. చేర్యాల ప్రాంతానికి సాగునీరందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రోడ్ల మంజూరుకూ హామీనిచ్చారు. అనంతరం మంత్రి సీతక్కను పలువురు శాలువాలతో సత్కరించారు. అనంతరం కమలాయపల్లి గ్రామస్తులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో నాగపురి రాజలింగం, గిరి కొండల్‌రెడ్డి, మల్లేశం, కొమ్ము రవి, కోల సాయిలు, కల్యాణీకమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవ, ఇంజినీరింగ్ శిక్షణలో ఒప్పందం

జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

పర్డ్యు యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుంటున్న ఎమ్మెల్యే, అనురాగ్ యూనివర్సిటీ చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

చేర్యాల, జూన్ 20 : అమెరికాలోని వివిధ యూనివర్సిటీలను జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో పర్డ్యు యూనివర్సిటీ ప్రతినిధులతో అనురాగ్ యూనివర్సిటీ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సేవల్లో ఇంజినీరింగ్ ప్రాజెక్టుల శిక్షణ రంగంలో పర్డ్యు యూనివర్సిటీ, అనురాగ్ యూనివర్సిటీలు పరస్పర సహకార ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎమ్మెల్యే పల్లా 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. కార్యక్రమంలో పర్డ్యు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఓక్ విలియమ్స్, ప్రొఫెసర్ మార్టినెజ్, అనురాగ్ యూనివర్సిటీ సీఈవో నీలిమ, డైరెక్టర్(స్టాటజీ) అనురాగ్ పల్లా పాల్గొన్నారు. అనంతరం ఇంజినీరింగ్ రీసెర్చ్‌లో ప్రతిష్టాత్మక ప్రదేమైన నీల్ ఆర్మ్ స్ట్రాంగ్ హాల్ ఆఫ్ ఇంజినీరింగ్‌ను అనురాగ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులు సందర్శించారు.

పోలీసుల నిర్లక్ష్యం వల్లే అల్లర్లు

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, జూన్ 20: పోలీసుల నిర్లక్ష్యం వల్లే మెదక్‌లో అల్లర్లు జరిగాయని ఎంపీ రఘునందన్ రావు అన్నారు. అల్లర్లలో అరెస్టయిన వారి కోసం మెదక్ కోర్టులో ఎంపీ నల్లకోటు ధరించి బెయిల్ కోసం జిల్లా న్యాయస్థానంలో వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అరెస్ట్ అయిన కార్యకర్తల పక్షాన నిలబడేందుకు చాలాకాలం తర్వాత నల్ల కోటు వేసుకున్నట్లు చెప్పారు. తెలంగాణలో గెలిచిన ఎనిమిది మంది బీజేపీ ఎంపీలకు కేంద్ర పార్టీ ఆధ్వర్యంలో సన్మానం ఉన్నా గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తల పక్షాన ఉండేందుకు మెదక్ కోర్టుకు వచ్చానని తెలిపారు. ప్రతి కార్యకర్త కృషి వల్లే ఎంపీగా గెలిచానని, వారికి ఏ కష్టం వచ్చినా ఉంటానని చెప్పారు. ఇరుపక్షాలూ వాదనలు వినిపించాయన్నారు. ఈనెల 21వ తేదీ వరకు కేసును వాయిదా వేసినట్లు చెప్పారు. తమకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికుల ధర్నా

మెదక్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

మెదక్, మున్సిపాలిటీ, జూన్ 20: కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు చెల్లించకపోవంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వేతనాలు చెల్లించకపోడవతో కార్మికుల కుటుంబాల పోషణకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులకువేతనాలు విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉన్నదన్నారు. సీఐటీయూ నాయకులు బాలమణి, సత్తయ్య, నాగరాజు, నర్సింహులు, బాబు, ప్రభాకర్, మల్లేశం, యాదయ్య, భిక్షపతి, రాములు తదితరులతో పాటు పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

రైల్వే జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ రఘునందన్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 20: మెదక్ పార్లమెంట్ పరిధిలో పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. గురువారం సికింద్రాబాద్‌లో దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను కలిసి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఏదులనాగులపల్లిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని, సిద్దిపేట నుంచి పెద్దపల్లి వరకు రైల్వేలైన్ పొడింగించాలన్నారు. పటాన్‌చెరు నుంచి అక్కన్నపేట, మెదక్ వరకు రైల్వే లైన్ పొడిగించాలని జీఎం దృష్టికి తీసుకెళ్లారు. మెదక్, సిద్దిపేట నుంచి తిరుపతి వరకు రైల్ నడిపించాలని, వడియారం, అక్కన్నపేటలో రాయలసీమ, అజంతా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వడియారం, సిద్దిరేట రైల్వే స్టేషన్లలో రేక్ పాయింట్స్ నిర్మాణం జరపాలని కోరినట్లు పేర్కొన్నారు. దీనికి జీఎం సానుకులంగా స్పందించారని ఎంపీ తెలిపారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 20: ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం సంగారెడ్డిలోని కిందిబజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవానికి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం పాఠశాలలోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్తహీనత, బలహీనత, ఆకలి మందగించడం, కడుపునొప్పి, శారీరకంగా, మానసికంగా ఎదగకపోవడం వంటి సమస్యలు ఏర్పడుతాయన్నారు. దీంతో చదువుల్లో వెనుకబడుతారని, భవిష్యత్తు పాడవుతుందన్నారు. పిల్లలు బాగా చదవాలంటే ఆరోగ్యంగా ఉండాలన్నారు. చాలామంది బాలికల్లో రక్తహీనత ఎక్కువగా ఉంటుందని, ఈ సమస్యను అధిగమించాలంటే మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ సంవత్సరంలో రెండుసార్లు ఆల్బెండజోల్ మాత్రలు తప్పకుండా వేసుకోవాలన్నారు. ఒకటి నుంచి 19 ఏండ్లలోపు పిల్లలందరూ ఈ మాత్రలు వేసుకోవాలని సూచించారు. అమ్మాయిలు బాగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ డీఐవో డాక్టర్ శశాంక్ దేశ్‌పాండే, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, డాక్టర్ శశాంక్, పాఠశాల ప్రిన్సిపాల్ రోజా, శ్రీరాంసుధాకర్, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయాలి

గుమ్మడిదల ఎంపీడీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజయపాల్‌రెడ్డి

గుమ్మడిదల, జూన్ 20: మండల కేంద్రంలో గురువారం ఎంపీడీవో నూతన కార్యాలయాన్ని సంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఎంపీపీ సద్ది ప్రవీణావిజయభాస్కర్ రెడ్డి ప్రారంభించారు. బొంతపల్లి పారిశ్రామికవాడలోని శ్యామ్ పిస్టన్ రింగ్స్ లిమిటెడ్ పరిశ్రమ సీఎండీ అందించిన రూ.60 లక్షల సీఎస్ఆర్ నిధులతో నూతన భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా పరిశ్రమ హెచ్ ఆర్ మేనేజర్ వెంకటరాజును సన్మానించారు. అనంతరం నూతన భవనంలో ఎంపీడీవో ఉమాదేవి, ఎంపీపీ సద్ది ప్రవీణాభాస్కర్ రెడ్డి తన చాంబర్లో పాలనను ప్రారంభించారు. భవనంలోని గదులను పరిశీలించిన అదనపు కలెక్టర్, జడ్పీ చైర్‌పర్సన్ మోడల్‌గా నిర్మించారని అభినందించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పారిశ్రామికవాడల్లో సీఎస్ఆర్ నిధులతో గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ చిన్న పాపనీకుమార్ గౌడ్, వైస్ఎంపీపీ నక్క మంజులావెంకటేశ్ గౌడ్, ఎంపీడీవో ఉమాదేవి, తాసిల్దార్ గంగాభవాని, మండల ప్రత్యేకాధికారి అఖిలేశ్‌రెడ్డి, ఎంపీటీసీలు ప్రభాకర్‌రెడ్డి, రాజలక్ష్మి, లక్ష్మి , పద్మా కొండల్ రెడ్డి, మద్ది మల్లమ్మ, పార్వతమ్మ, నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, మాజీ సర్పంచులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం ప్రారంభోత్సవ శిలాఫలకం విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య ప్రొటోకాల్ రగడ కొనసాగింది. ప్రొటోకాల్ ప్రకారం ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులపై ఆరోపణలు చేశారు. ప్రొటోకాల్ ప్రకారమే ఏర్పాటు చేశామని బీఆర్ఎస్ నాయకులు అన్నారు.

నూతన చట్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్

శిక్షణలో మాట్లాడుతున్న సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, జూన్ 20: దేశవ్యాప్తంగా జూలై ఒకటి నుంచి అమలు కానున్న నూతన చట్టాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్ అన్నారు. గురువారం పోలీ సు కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను ప్రారంభించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నూతన చట్టాలను ఎస్‌హెచ్‌వోలు, పోలీసు అధికారులు తెలుసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా అమలుకానున్న కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని సెక్షన్లపై పూర్తి అవగాహన అవసరమని, అప్పుడే బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, అరెస్ట్, వాంగ్మూలం నమోదులో పాటించవలసిన జాగ్రత్తలు, చార్జిషీట్ ఎలా తయా రు చేయాలి అనే విధానాలపై అవగాహన వస్తుందన్నారు. నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు వ్యవహరించాల్సిన తీరు, తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్ డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శివలిం గం, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎస్‌హెచ్‌వోలు తదితరులు పాల్గొన్నారు.